క్లుప్తంగా

నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం

నర్సంపేట రూరల్ : ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు టౌన్ సీఐ రమణమూర్తి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని నర్సింగాపురం గ్రామానికి చెందిన గద్దెపల్లి రాజు ఇంట్లో ప్రభుత్వ నిషేధిత గుట్కా, అంబర్, రత్న పొగాకు ఉత్పత్తులు నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.4735 విలువైన గుట్కా, అంబర్, రత్న ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రాజును అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్సైలు రవికుమార్, గూడ అరుణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అరెస్ట్

నర్సంపేట రూరల్ : సోదరుడిపై గొడ్డలితో దాడి చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గూడ అరుణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని చంద్రయ్యపల్లికి చెందిన బరిగెల జయపాల్ గురువారం రాత్రి మద్యం మత్తులో తల్లిదండ్రులపై, భార్యపై దాడికి యత్నించగా ఆయన్ను ఆయన సోదరుడు దశరథం అడ్డుకున్నాడు. దీంతో దశరథంపై జయపాల్ గొడ్డలితో దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన దశరథంను కుటుంబ సభ్యులు, స్థానికులు స్థానిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. తండ్రి రాంచంద్రు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జయపాల్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రాజు



దుగ్గొండి : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని నాచినపల్లికి చెందిన పెండ్యాల రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. సుమారు 30 ఏళ్ల పోరాట ఫలితంగా ప్రభుత్వం కులగణన చేపడుతోందని చెప్పారు. జనాభా ప్రాతిపదికన 56 శాతానికిపైగా ఉన్న బీసీ కులాలకు రాజీవ్‌గాంధీ హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే ఉందన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాగల శ్రీనివాస్, బైరి రవి కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్, వడ్లకొండ వేణుగోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

టీఏఎస్ జిల్లా కోకన్వీనర్‌గా భాస్కర్



పర్వతగిరి : తెలంగాణ అంబేడ్కర్ సంఘం (టీఏఎస్) జిల్లా కోకన్వీనర్‌గా మండలంలోని తురుకల సోమారం గ్రామానికి చెందిన జంగిలి భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య శనివారం నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ తాటికాయల వివేకానంద, తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ పద్మశాలి సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక



ఖానాపురం : మండలంలోని మంగళవారిపేట, ధర్మరావుపేట, బుధరావుపేట గ్రామాల మార్కండేయ పద్మశాలి సేవా సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లింగబత్తుల యాక స్వామి, ఉపాధ్యక్షుడుగా దేవులపల్లి నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా అడ్లగట్ల ప్రసాద్, కోశాధికారిగా చిట్యాల దయాకర్, గౌరవ అధ్యక్షుడుగా కోడం రమణ, సభ్యులుగా రవి, బింగి రాజు, కుసుమ శ్రీను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు యాక స్వామి మాట్లాడారు. పద్మశాలీ కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సంఘాన్ని మరింతగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు చిట్యాల వీరన్న, కందగట్ల భిక్షపతి, లింగబత్తుల హరీశ్, కృష్ణ, సతీశ్, బాలరాజు, సుమన్, రాము పాల్గొన్నారు.

'భూములు లాక్కోవాలనే ఆలోచన మానుకోవాలి'

పర్వతగిరి : వికారాబాద్ జిల్లా లంగిచర్ల, తదితర గ్రామాల రైతుల భూములను లాక్కోవాలనే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని ఆర్ఎస్‌పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లందాస్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు వీడాలని కోరారు.

వర్ధన్నపేట : దీపాలు వెలిగిస్తున్న మహిళలు



సంగెం : శ్రీరామలింగేశ్వర ఆలయంలో..



చెన్నారావుపేట : సిద్ధేశ్వరాలయంలో



భక్తిశ్రద్ధలతో దీపోత్సవం

జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, దుగ్గొండి, చెన్నారావుపేట, ఖానాపురం, సంగెం, దుగ్గొండి, తదితర మండలాల్లో భక్తులు శుక్రవారం కార్తీక దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులతో సందడి నెలకొంది. మహిళలు దీపాలు వెలిగించి ఆరాధించారు. ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. అర్చకులు, ఆలయ కమిటీల నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నల్లబెల్లి : శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో..



దుగ్గొండి : నాచినపల్లి రామాలయంలో..



ఖానాపురం : ధర్మరావుపేటలో..



గీసుకొండ : ఊకల్ ఆలయంలో..

సత్యనారాయణస్వామి వ్రతం



నర్సంపేట : అయ్యప్ప స్వామి ఆలయంలో వ్రతం ఆచరిస్తున్న దంపతులు

నర్సంపేట : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ గుప్తా ఆధ్వర్యంలో అర్చకులు దేవేశ్ మిశ్రా నిర్వహణలో ఉదయం సుప్రభాత సేవ, మహా ధ్వజారోహణం, శ్రీరమా సహిత సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా 63 మంది దంపతులతో అర్చకులు రామకృష్ణ, హరీశ్, పవన్ శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వ్రతం చేయించారు. మధ్యాహ్నం అయ్యప్ప మాలధారులకు కిరాణ వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సైఫ సురేశ్, ప్రతినిధులు మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, చింతల కమలాకర్‌రెడ్డి, దొడ్డ రవీందర్, భూపతి లక్ష్మీనారాయణ, శ్రీరాముల శంకరయ్య, దొడ్డ వేణు, మల్యాల రాజు, కిరాణ వర్తక సంఘం బాధ్యులు దాసరి నర్సింహారెడ్డి, పుట్ట రామస్వామి,



రాయపర్తి : శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో...

సోల్తి చిన్న సాంబయ్య, బండి వేణు, సోల్తి రాజ్‌కుమార్, పుల్లూరి వేణుగోపాల్, గాదగోని భిక్షపతి, అర్చకులు దేశి రాము, శ్రీధర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని రాయపర్తి, సన్నూరు, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన అర్చకులు రంగాచార్యులు, రామకృష్ణమాచార్యులు, రమణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పర్వతగిరి : మండలంలోని సోమారం గుంటూరుపల్లికి చెందిన చౌడ లక్ష్మీనారాయణ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పరామర్శించారు. తొలుత లక్ష్మీనారాయణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రోళ్లకల్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగపురి సత్తయ్య గౌడ్, మండల కేంద్రానికి చెందిన చెనమాల ఎల్లమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పెర్కవేడులో..

రాయపర్తి : మండలంలోని పెర్కవేడుకు చెందిన నల్ల ఎల్లమ్మ, సుతారి యశోద ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలను తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యా నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమాల్లో వర్ధన్నపేట మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, సోమేశ్వరాలయ కమిటీ సభ్యులు పెండ్లి మహేందర్‌రెడ్డి, మాచర్ల ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి, చిర్ర మల్లయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహమూద్, నాయకులు కోతి కల్యాణ్, సుతారి యాదగిరి, బండి కుమార్, అబ్బోజు సేనాపతి, సాయిలు, గద్దం సుధాకర్, మేడి శ్రీను, రఫీ, గారె సాయిలు, వేల్పుల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో పోరాడాలి

ఖానాపురం : ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యమిస్తూ ప్రాణాలర్పించిన అమరుల స్ఫూర్తితో పాలకులు అవలంబిస్తున్న తప్పుడు విధానాలపై పోరాడాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి కోరారు. అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని బుధరావుపేట, బండమీదిమామిడితండాలో సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో శుక్రవారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పైడి మాట్లాడారు. పాలకులు అనుసరిస్తున్న తప్పుడు, ప్రజావ్యతిరేక విధానాలపై అనేక మంది ఉద్యమించి ప్రాణాలర్పించారని చెప్పారు. వారి త్యాగాలను స్మరించాలని సూచించారు. అమరుల ఆశయ సాధన కోసం పోరాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమాల్లో నాయకులు ఈరెల్లి రాంచందర్, వీరన్న, సారయ్య, అంకూస్, ఈరెల్లి శారద, ప్రమీల, రాజు, రామ్మూర్తి, నరేశ్, గోప్యా, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న పైడి, నాయకులు

చెత్తాచెదారం తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

చెన్నారావుపేట : మండల కేంద్ర శివారులోని ప్రధాన రహదారి వెంట ఉన్న చెత్తాచెదారాన్ని పంచాయతీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. రోడ్డు పక్కనే చెత్త, ప్లాస్టిక్ వేస్టేజీ, కోళ్ల కళేబరాలు కంపు కొడుతుండగా 'రోడ్డు పక్కనే చెత్త' శీర్షికతో ఈనెల 13న 'సాక్షి'లో 'అటెన్షన్ ప్లీజ్' శీర్షికలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి రంజీత్ స్పందించారు. సిబ్బందితో చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు.

కాలభైరవ ఆలయంలో నాగసాధువు పూజలు



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామంలోని కాళభైరవ ఆలయంలో అఘోరీ నాగసాధువు శుక్రవారం పూజలు నిర్వహించారు. తనను సందర్శించడానికి వచ్చిన భక్తులను విభూదితో అఘోరీ ఆశీర్వదించి మాట్లాడారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం యాత్ర సాగిస్తున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి



కుమారస్వామి (ఫైల్)

సంగెం : గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మొండ్రాయికి చెందిన కక్కెర్ల కుమారస్వామి (52) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం రాత్రి టెక్స్‌టైల్ పార్కు ఉద్యోగులను వరంగల్ నగరానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో గుండెపోటుకు గురయ్యాడు. స్థానికులు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. కుమారస్వామి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుమారస్వామి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

ధర్మ యుద్ధ సభను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రణయ్ దీప్

దుగ్గొండి : ఈనెల 20న మండల కేంద్రంలో తలపెట్టిన ధర్మయుద్ధ సభను జయప్రదం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్ దీప్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంద కృష్ణ పోరాట ఫలితంగానే సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. ఆ తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బొట్ల నరేశ్, పర్లపెల్లి బాబు, దామెర సుధాకర్, మల్లయ్య, రాకేశ్ కుమార్, రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–4 పరీక్షలో ప్రతిభ



ఏసిరెడ్డి రవళి



శ్రీకాంత్



గుంటి బాలరాజు



రాజ్‌కుమార్



కొంకీస అజయ్

రాయపర్తి : మండలంలోని వెంకటేశ్వరపల్లికి చెందిన ఏసిరెడ్డి సువర్ణ–మోహన్‌రెడ్డి దంపతుల కూతురు రవళి, మహబూబ్‌నగర్‌కు చెందిన గుంటి బాలరాజు, జయరాంతండా (ఎస్)కు చెందిన గుగులోతు జీజా–కీమా దంపతుల కుమారుడు శ్రీకాంత్ గ్రూప్–4 పరీక్షలో ప్రతిభ చాటి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించారు. కాగా శ్రీకాంత్ ఇది వరకే సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికై ప్రస్తుతం శిక్షణలో ఉన్నాడు. ఉద్యోగాలు సాధించిన క్రమంలో రవళి, బాలరాజు, శ్రీకాంత్‌లను వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కానిస్టేబుల్..

నర్సంపేట : పట్టణానికి చెందిన కొంకీస పద్మావతి–కుమారస్వామి దంపతుల కుమారుడు అజయ్ గ్రూప్–4 పరీక్షలో ప్రతిభ చాటి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అజయ్ ప్రస్తుతం కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఆయన్ను పోలీసు అధికారులు, సిబ్బంది, తల్లిదండ్రులు, బంధువులు, గౌడ సంఘం నాయకులు అభినందించారు.

పంచాయతీ కార్యదర్శి..

చెన్నారావుపేట : మండలంలోని జీడిగడ్డ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న పాత ముగ్దుంపురం గ్రామానికి చెందిన రాగి రాజ్‌కుమార్ గ్రూప్–4 పరీక్షలో ప్రతిభ చాటి జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీడీఓ నల్ల శ్రీవాణి, ఎంపీఓ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు, కుటుంబీకులు, గ్రామస్తులు అభినందించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రంజిత్‌రెడ్డి, తదితరులు

నెక్కొండ : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి సరైన ధర లభిస్తుందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రెడ్లవాడలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం నిబంధనల మేరకు తేమ శాతాన్ని పరిశీలించి ధాన్యాన్ని తీసుకురావాలని చెప్పారు. రైతులకు మద్దతు ధర కల్పించేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జలగం సంపత్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, నర్సంపేట ఏజీపీ శివకుమార్, డైరెక్టర్లు కొమురయ్య, మహిపాల్‌రెడ్డి, సీఈఓ జనార్దన్, నాయకులు సాయికృష్ణ, వీరభద్రయ్య, రాజశేఖర్, భానుప్రకాశ్, రవినాయక్, ప్రశాంత్, పాల్గొన్నారు.

ధాన్యానికి బోనస్‌తో ఆర్థిక తోడ్పాటు

దుగ్గొండి : ధాన్యానికి బోనస్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రైతులకు ఆర్థిక తోడ్పాటు అందిస్తోందని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తెలిపారు. మండలంలోని నాచినపల్లిలో శుక్రవారం నిర్వహించిన కళాజాతలో ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న అవకాశాలపై ఆటపాటలతో అవగాహన కల్పించారు. క్వింటా నాణ్యమైన సన్నధాన్యానికి ప్రభుత్వం రూ.500 చొప్పున బోనస్ ఇవ్వడంతోపాటు రూ.2320 మద్దతు ధర చెల్లిస్తోందని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని, దళారులను ఆశ్రయించొద్దని సూచించారు. కార్యక్రమంలో కళాకారులు నెల్లుట్ల సుమన్, యోచన, తాళ్ల సునీల్, పడిదం రాజేందర్, గాదెపాక బాబు, బరిగెల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కేంద్ర నిధులతో అభివృద్ధి పనులు



సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీవాణి

చెన్నారావుపేట : కేంద్ర ప్రభుత్వం కేటాయించే నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంపీడీఓ నల్ల శ్రీవాణి తెలిపారు. గిరిజన నాయకుడు బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం జన జాతీయ గౌరవ దినోత్సవ్ కింద మండలంలోని ఎల్లాయగూడెం, అమీనాబాద్‌లను ఎంపిక చేసిన క్రమంలో ఆయా గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన సభల్లో ఎంపీడీఓ మాట్లాడారు. ప్రజలు పరిసరాల శుభ్రతను సామాజిక బాధ్యతగా భావించి దినచర్యలో భాగంగా పాటించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో అభివృద్ధి పనులు చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఎల్లాయగూడెం, పాపయ్యపేట, బోజెర్వు మీదుగా చెరువుకొమ్ము తండా, 16 చింతల్ తండా, గుండెంగ మీదుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సభలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్ రాజు, పంచాయతీ కార్యదర్శి అవినాశ్, నిట్టు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో వివరాల నమోదు కీలకం

సంగెం : సామాజిక, రాజకీయ, కులగణన సర్వేలో కుటుంబాలకు సంబంధించి అడిగిన అన్ని వివరాల నమోదు కీలకమని తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొత్తగూడెం, తీగరాజుపల్లి గ్రామాల్లో చేపట్టిన సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించి ఎన్యుమరేటర్లకు సూచనలు, సలహాలు అందించారు. సర్వే ఫారంలో అడిగిన అన్ని వివరాలను ఓపికతో నమోదు చేయాలని సూచించారు. ఎన్యుమరేటర్లకు సరైన సమాచారం అందించి సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సర్వే పత్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్